హరిదాసు

రాజావాసిరెడ్డి శ్రీదుర్గా సదాశివేశ్వరప్రసాద్ బహదర్‌గారు

16 వ శతాబ్దియందొక పురుషుడు ఢిల్లీ సమీపమందలి యరణ్యములో వసించుచుండెను. ఇతని యూరు పేరులేవియో, కులగోత్రములేవియో, తలిదండ్రులెవ్వరో, పూర్వవృత్తాంతమెట్టిదో, తెలియరాకున్నవి. కాని జనము వీనిని 'హరిదా'సని పిలుచుచుండిరి. ఇత డైహికసంపదలు నశ్వరములని గుర్తించి మునిజనములకు శరణ్యమైన యరణ్యముజేరెను. అక్కడ నొక కుటీరము నిర్మించుకొని యందు నివసించుచుండెను. అక్కడ నితడు ప్రశాంతముగా గూర్చుండి పరమపురుషుని ధ్యానించుచుండువాడు. ఇట్లత డొకొకతూరి భక్తిపరవశుడై మహానంద మనుభవించుచు నాకలి దప్పులగూడ నెరుగకుండు వాడట. సంగీతశాస్త్రమున బాగుగా బరిశ్రమించిన వాడు. గాత్రము శ్రావ్యమైనది. తంబురా బట్టుకొని భక్తి తత్పరుడై పరమేశ్వరునిగూర్చి భక్తిగీతములు పాడుచున్నప్పుడు శ్రోతలకుఁగూడ హృదయముఁ జలించి దేహము పులకరించునట్లు భక్త్యావేశముపొరలివచ్చును.

ఈతనికి 'తాన్‌సే'నను వాఁడు శిష్యుడుండెను. తాన్‌సే నితనియొద్ద సంగీతము జక్కగా నేర్చుకొన్నాడు. తాన్‌సేనుడు సుగుణమణి యనిపించుకొన్న 'అక్బర్ చక్రవర్తి' యాస్థానమున సంగీతపండితుడుగా నున్నాడు. సార్వభౌముడు తనకు తీరిక గలిగినప్పుడెల్ల తాన్‌సేనుని పిలిపించుకొని గీతముల పాడించి యానందించువాఁడట. శ్రావ్యమైనవాని గీతసరణి ననేకమార్లు పాదుషా ప్రశంసించుచుండువాడు. ఇట్లతడు ప్రస్తుతించినపుడెల్ల తాన్‌సేనుడు 'రాజా! ఇందు నాప్రజ్ఞ యేమియు లేదు. ఇదంతయు నాగురుపాదుల కటాక్షమే! నేను వారి పాదపరాగపరమాణువును. మీప్రస్తుతులన్నియు వారికి జెందదగినవి.' అన్ని విన్నవించుచుండువాడు. ఈ మాటలు వాని వినయశీలమునకు నిదానములని చక్రవర్తి యనుకొనుచుండెనేకాని వానినంతగా సరకుచేయకుండెను.

ఒకనాడేలనో సార్వభౌముని మన మీ మాటలపై పారినది. భగవానుడు హరిదాసుని పరీక్షించుటకీసంవిధానము సంఘటించుచున్నాడేమో? సార్వభౌముడు ఇట్లడిగినాడు. "తాన్‌సేన్! నీగీతములందలి మాధుర్యముచే ముగ్ధుడనై నిన్ను ప్రశంసించినపుడెల్ల నీవు నీగురుని ప్రస్తుతించెదవే అతడెవరు? ఎక్కడనున్నాడు? ఆతని గీతమాధుర్యము నాకు చవిజూపవా?" అని. అత డామాటల కేమియు బదులు చెప్పలేదు. ఎంత గ్రుచ్చి గ్రుచ్చి యడిగినను బదులు చెప్పకుండుటచే అక్బరు కోపగించెను. అప్పుడు తాన్‌సేనుడు "అయ్యా! అతడు ఆస్థానములకువచ్చి అడుగుకొనువాడు కాడు. సమయముచూచి ఆయనకడకు మిమ్ముతీసికొని పోయి ఆయనపాట వినిపించెద" నని ఆయన

చెప్పెను "సరే యట్లేచేయు" మని చక్రవర్తి యనెను.

పిమ్మట తాన్‌సేను డొకనాడు పాదుషా గారిని తనవెంట తనగురువు హరిదాసు ఉన్న యడవికి తీసికొనిపోయి సార్వభౌముని ఆతని కుటీరము వెలుపల కూర్చుండబెట్టి "అయ్యా! మీరిచ్చట సడిసవ్వడి చేయక గూర్చుండియుండుడు. నేను లోపలికి బోయి యాభక్తవర్యుని ప్రసన్నుని జేసికొని పాటపాడించెదను." అని చెప్పి తాను లోపలికిబోయెను. గురునకు సాష్టాంగపడి లేచి కుశలాదికము లడిగి "స్వామీ! సంసారపు గజిబిజి పాటులచే మనస్సు చీకాకైయున్నది. భక్తిపూరితమైన తమగానమును విని చిత్తశాంతి సమకూర్చుకొనుటకు వచ్చినాను. అనుగ్రహింపకోరెదను." అనెను. హరిదా సంతట తంబురాను చేతికి తీసికొని శ్రుతిసవరించి పాడ నారంభించెను. కొంతసేపగు నప్పటికి భక్తివివశుడైన యతనిగానప్రవాహము మృదుస్వనముతో ననర్గళముగా ప్రవహింప సాగెను. కుటీరము వెలుపలనున్న అక్బరు చక్రవర్తిగూడ ఆ గాన మాధుర్యమునకు ముగ్ధుడై ఆనందపారవశ్యముచే నప్రయత్నముగ నోరెత్తి 'వహ్వారే' యని ప్రశంసించెను.

ఆధ్వని విని హరిదాసు "తాన్‌సేన్! వెలుపల నెవరో యున్నట్లున్నారే!" యనెను.

"ఔనుస్వామీ! అక్బరు సార్వభౌముడు శ్రోత్రపేయమైన మీ గానమును విన గుతూహలపడి నన్ను గోరగా తీసికొనివచ్చి వాకిట కూర్చుండబెట్టితి" నన్నాడు తాన్‌సేను. హరిదా సామాటలు విని "తాన్‌సేనూ! నీవవివేకివిగదోయీ! ఐహికభోగములలో నంటుకొనియున్న వారి నిట్లు తీసుకొని రాదగునా? అట్లయిన మన చిత్తశాంతి జీర్ణింపదోయీ! అయినను వాని నింతదూరము తీసికొని వచ్చితివి కాన లోపలికిగూడ గొనిర"మ్మనెను. తాన్‌సే నట్లు చేసినాడు. అక్బరుపాదుషా లోపలికి వచ్చి తాను సార్వభౌముడనని గర్వింపక హరిదాసు పాదములపైబడి నమస్కరించినాడు. హరిదాసు పాదుషాను కుశలమడిగి "చిరునవ్వుతో నాపాట వినుటకా యింత దూరమువచ్చితివి? ఇదిగో పాడుదును. నీమనసార విను" మనెను. అని తంబురా దీసికొని పాడసాగెను. ఆగానమాధుర్యముచే నాకర్షితములై రెండు లేడిపిల్లలు పరుగుపరుగున వచ్చి యక్కడ నిలచి చెవులు దోరగించికొని వినుచుండెను. హరిదా సిట్లు కొంతసేపు పాడి విరమించెను. అక్బ రప్పుడు తన మెడయందున్న అమూల్యమైన మౌక్తికహారమును తీసి హరిదాసుని పాదములపై నిడెను. సర్వస్వము త్యజించిన సన్న్యాసి కావెలలేని ముత్తియపు పేరుతో ప్రయోజనము? మట్టిబెడ్డయు, మణియు వాని దృష్టిలో సమానము లేకదా! హరిదాసు డాపేరును తీసి తన చెంతనున్న జింకపిల్లలలో నొకదాని మెడలో వైచెను. ఆజింకపిల్లలు చెంగు చెంగున దుముకుచు పరుగెత్తిపోయినవి.

అక్బ రదిచూచి లజ్జపడి తనలో నిట్లనుకొనినాడు:—"అమూల్యమైన ఈ హారమును

నేనెంత కష్టపడి సంపాదించితిని. ఈయడవిజనునకు దీనివిలువ యేమి తెలియును. కోతికి కొబ్బరికాయ చిక్కిన ట్లయినది వీని కీహారము లభించుట" అని అక్బరు పాదుషా ఆతనిగానసౌష్ఠవము గుర్తించినాడు; ఆదరించినాడు; నిరీహుడైన యతి డది స్వీకరింపకుండుటచే సిగ్గుపడినాడు; చీకాకుపడుచున్నాడు; తనహారపు విలువ దలచికొని చింతించు చున్నాడు కాని వాని యాధ్యాత్మికసౌష్ఠవమును గుర్తింపలేకపోయినాడు; దానికి విలువగట్టలేకున్నాడు. అది సామాన్యజనులకు సాధ్యమగునా? హరిదాసు పాదుషాయొక్క ముఖవికృతిచూచి ఆతని హృదయము తెలిసికొన్నాడు. తెలిసికొని మరల తంబురా మీటుచు గానమొనర్పసాగినాడు. ఆవనమందలి లేడు లన్నియు పరువు పరువునవచ్చి గానము వినుచున్నవి. వాని యన్నిటి కంఠములందును పాదుషాహారముం బోలిన వెలగలహారములేయున్నవి! ఆ విచిత్ర సంవిధానము పాదుషాచూచినాడు. ఆచ్చవడి లజ్జతో తలవంచుకొనుచున్నాడు. వాని యాహాప్రపంచమంతయు స్వప్నమువలె నంతర్ధానమైపోయినది. హరిదాసుని ప్రభావము గుర్తించినాడు. అత డొక మహాత్ము డనుకొన్నాడు. తన యవివేకపు తలపుల దెలిసికొనియే యతడు తనను మృదువుగా మందలించుట కిట్టి సంవిధానము గల్పించినా డనుకొన్నాడు. మిసమిసల చూచి మోసపోయి ఐహికసుఖములు మాత్రమే యపేక్షించి పారమార్థిక సౌభాగ్యము భంగపరచుకొనరాదని తెలిసికొన్నాడు.

ఇంతలో హరిదాసు "సార్వభౌమా! వీనిలో మీహార మేదియో గుర్తించితీసికొం"డని చెప్పినాడు. పాదుషా కప్పుడేమి చేయుటకు తోపలేదు. హరిదాసుని పాదములపైబడి "నన్ను క్షమింపు" మని వేడుకొన్నాడు. హరిదాసు వానిని లేవదీసి "రాజా! భయములేదు. ప్రాపంచికసౌఖ్యములే పరమార్థమనుకొనకు. సద్వృత్తికలవాడవై పరలోకపాథేయమును సమకూర్చుకొనుము. న్యాయదృష్టితో ప్రజాహితముగా రాజ్యము బాలింపుము. మతపక్షపాతము లేని నీవంటిప్రభువు లభించుట ప్రజలభాగ్యము. నీకు మంగళమగుగాక! పోయిరమ్ము." అని యాశీర్వదించి పంపెను.

ఈ కథ హిందూమహమ్మదీయమైత్రికొరకు పరిశ్రమించిన అక్బరుపాదుషాయొక్క సౌజన్యమును ప్రకటించుచున్నది.